
కథ



# పొద్దు ములిగి పోయింది

గంటేడ గౌరునాయుడు

**పొద్దు ములిగి పోయింది.**

**సంధ్యా రాగంలోని అందాల్ని కాక విషాదాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించిన ఓ నీటి రంగుల చిత్రానికి ఆ చిత్రకారుడు పెట్టిన పేరది.**

దిగంతాలకు విస్తరించిన అపారమైన జలరాశి. ఆ జలరాశి నడుమ ధ్యాన మగ్నుడైన మునీశ్వరుడి శిరస్సులా గుడిగోపురం కంటి గూటి నుండి శలవు తీసుకుంటున్న కాంతి పక్షిలా గోపురం వెనుక అస్తమిస్తున్న సూర్యబింబం. చెరువులో యీదులాడుతున్న నీటిబాతులా మరబోటు. నీటి అడుగు నుండి పారదర్శకంగా కనబడుతున్న గుడి. రెక్కల్లార్చుతూ గోపుర కలశం మీద వాలుతున్న గెద్ద. ఓ విషాద గీతం లాంటి రంగుల కవిత్వం ఆ చిత్రం దిగువున 'పొద్దు ములిగి పోయింది' అనే అక్షరాలు చేతిరాతలో...

నాగావళి నది మీద బేరేజీ నిర్మాణం కోసం సర్వే జరుగుతున్న రోజులు. సాహితీ మిత్రులం కొందరం ఆయా ముంపు గ్రామాల్లో తిరిగి ప్రజాభిప్రాయం సేకరించి కవితలు రాయాలని, అవి ఓ సంకలనంగా వేయాలని అనుకుంటున్నపుడు వేది చిత్రించిన ఊహా చిత్రమిది. నేను 'సంధ్యారాగం' అనే పేరు పెడితే తను 'పొద్దు ములిగి పోయింది' అన్నాడు.

ములిగి పోయింది పొద్దా? మన బతుకులా?

అర్థమయ్యింది నామ సార్థక్యం.

ఇప్పుడా చిత్రాన్ని ఓ ప్రముఖ దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురించింది. ఆ చిత్రం పక్కనే ఓ ఫొటోని కూడా ప్రచురించిందా పత్రిక. వాటిని గురించి వివరిస్తూ... 'ఆరేళ్ళకు ముందు చిత్రించిన వూహాచిత్రం... ఆరు రోజులనాడు తీసిన ఫొటో... రెండూ ఒకేలా వుండటం... అరుదైన వింత. అస్తమిస్తున్న సూర్యబింబంతో పాటు గోపుర కలశం మీద వాలుతున్న గద్దనూ, మరబోటునూ చిత్రించడం యాదృచ్ఛికం అని కొట్టిపారేయలేమని, అది ఓ కళాకారుని దార్శనికతకు నిదర్శనమనీ' అన్నారు. భవిష్యత్ చిత్రపటాన్ని కొన్నేళ్ళకు ముందే ఆవిష్కరించిన ఆ చిత్రకారుడు బ్రతుకు భారమై రోడ్డున పడటం అత్యంత విషాదం. 'అనుమతి లేని కారణంగా అతని పేరు, ఫొటో ప్రచురించలేకపోతున్నాం' అని రాసారు.

మనసు కల్లోల సాగరమైంది.

చిత్రంలోని జలరాశి నా కళ్ళలో సుడి తిరిగింది.

నాగావళి పూల కెరటాలతో నాలో ఎగిసిపడింది.

ఆ నీటి అలల రేఖల్లో చిరపరిచితమైన కుంచె కదలికల గీతల వొంపుల్లో... కలిసిపోయేలా... ఆ పేరు... వేది.

నా మిత్రుడు పరశువేది.

ఆనందాల హరివిల్లులోని రంగులన్నీ కరిగి మిగిలిన దుఃఖపు చీకటి నలుపునీ, కంటి కొసలలోని అరుణ వర్ణాన్నీ తన బొమ్మలకి రంగులుగా అద్దుతూ... ఎక్కడున్నాడో...!?

ఏటి కెరటాలకు గడ్డి పరకలు కొట్టుకుపోయినట్టు మనిషో వైపు చెదిరిపోయేం. జ్ఞాపకాలు కూడా మాసిపోతున్న తరుణంలో ఇప్పుడీ చిత్రం. బుక్ షెల్ఫ్‌లోంచి 'నిర్వాసిత గీతం' కవితా సంకలనం తీసేను. ముఖచిత్రం వేది చిత్రించిన పెయింటింగ్ 'పొద్దు ములిగి పోయింది'. దాన్ని తాకితే... నీటి అడుక్కి చేరిన వూళ్ళోని మా ఇల్లు చేతికి తగిలినట్టైంది.

ఆ అనంత జలరాశి నడుమ ఓ కన్నీటి బొట్టు జారి అలలు రేగేయి... వలయాలు వలయాలుగా.

***

ఈ వొంపు నాగావళికెంత అందాన్నిచ్చిందో చూసేవా... నాగావళి... జంఝావతి కలిసిన ఆ సంగమ క్షేత్రంలో మహాశివుని పాద పద్మాలను అభిషేకించి, తీర భూముల దాహార్తిని తీర్చి, హరిత రాగాలను ఆలపిస్తూ ఎంత వుత్సాహంగా ఉరకలేస్తోందో... వయ్యారమంతా ఆ మలుపులోనే వున్నట్టుంది కదూ! సందె వెలుగులో ఆలయ గోపురం నీటి అద్దంలో తుది మెరుగులు దిద్దుకుంటున్నట్టు కోవెల నీడ...

"చేతిలో చెయ్యేసి చెల్లెలితో కలిసి పరుగులు తీసే అల్లరి పిల్లలా లేదూ జంఝావతితో కలిసే నాగావళి! పాదాల పట్టీల మువ్వల్లా అలలు రవళిస్తుంటే ఏటవాలు కిరణం ఒకటి నది అంచున సుడి తిరిగి నీటి పిట్టలతో కలిసి పచ్చని పంట చేల మీద ఆరవేసే మసక వెలుతురు మేలి ముసుగూ... తీరం పొడవునా పాల నురగలా విరబూసి అలలతో పోటీపడే ఆ రెల్లుపూల ప్రవాహమూ..."

నాగావళి ఒడ్డున కూర్చుంటే మాకు కాలం తెలిసేది కాదు. నేను నా ఆలోచనలకు అక్షర రూపం యిస్తే, బొమ్మ గీసేవాడు వేది. విశేషమేమంటే వేదికి కుంచెలు, రంగులు, కేన్వాసు అక్కర్లేదు. దళసరి తెల్ల కాగితం ముక్క చాలు. కుడిచేతి బొటనవేలు చూపుడువేలు గోళ్ళ మధ్య సాధారణమైన తెల్లకాగితం ముక్క క్షణాల్లో అసాధారణ అద్భుత కళాఖండంగా మారిపోతుంది. నేను నా కవితల్లో ఆవిష్కరించుకున్న అందాలు ఆ తెల్ల కాగితం మీద ప్రత్యక్షం కావడం అద్భుతంగా వుండేది. నాగావళి ఒడ్డున వేది, నేను ఎన్ని సాయంత్రాలు రాత్రులుగా

మారిపోతుంటే చూస్తూ గడిపేసామో! వేది గీత నాగావళి. నా గీతం నాగావళి. మా యిద్దరికీ తల్లి, చెల్లి, ప్రేయసి... మా సమస్తమూ నాగావళి. మేము నాగావళి ప్రేమికులమని... నాగావళి తప్ప మరో లోకం తెలీదని మా మిత్రబృందం మమ్మల్ని ఆట పట్టించేవాళ్ళు.


ఓ రోజు నాగావళి వుధృతంగా ప్రవహిస్తోంది. పెద్ద దూలం వొకటి కెరటాల్లో తేలి వస్తుంటే నేను దభాలున ఏట్లో దూకి దూలాన్ని వొడ్డుకు చేరవేసే లోపల తిరుగుడు గుమ్మిలోకి జారిపోయేను. నాకు స్పృహ వచ్చేసరికి నా చుట్టూ జనం. పరిచర్యలు చేస్తూ వేది.

"నాగావళి మీ అమ్మ కదా. ఇలగ చేసిందేట్రా..." అని యికటాలాడేరు మా మిత్రులు. అప్పుడు వేది అన్నాడు కదా. "అమ్మ కాబట్టే అరిచేతిల పెట్టుకొని ఒడ్డుకు తెచ్చింది" అని. అంత నమ్మకం వేదికి. నాగావళితో వున్న అనుబంధం... ఆ సాన్నిహిత్యమే తనను కళాకారుణ్ణి చేసిందంటాడు.

నల్లగా... సన్నంగా రివటలా వుండే వేదికి తనని, తన కళనీ ప్రపంచం గుర్తించాలని తపన. తనను ఏ అమ్మాయీ ప్రేమించదనీ, అంత గొప్ప అందం తనదనీ నవ్వేవాడు. వాడి అపనమ్మకాన్ని వమ్ముచేస్తూ కొనగోటి సౌందర్యానికి ముగ్ధురాలై ఓ గొప్పింటి అమ్మాయి ప్రేమలేఖ రాసింది. ఆ అమ్మాయి కోసమే అద్భుతమైన బొమ్మలు గీసేడు. వాడి ముఖంలో ఓ కొత్త వింత అందం మెరిసింది. ప్రేమకున్న శక్తి యింత గొప్పదా అనిపించింది. అయితే అన్ని ప్రేమ కథలలాగే వాళ్ళ కథా విషాదాన్నే మిగిల్చింది. యిక్కడా... కులమూ, డబ్బూ ప్రధాన పాత్ర వహించాయని నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కొన్నాళ్ళు బొమ్మల ప్రపంచానికి దూరమైనా మళ్ళీ మా ప్రపంచంలో పడ్డాడు. బొమ్మల ప్రపంచంలో మునిగి పోయేడు.

"చేతిలో పరశువేది వున్నవాడు పట్టిందల్లా బంగారమవుతుందట. మా వాడు పేరుకే పరశువేది. ఏది పట్టుకున్నా మట్టే అంటాడు వాళ్ళ పెదనాన్న. నేనందుకు అంగీకరించలేకపోయేవాణ్ణి. ఒక అర్థవంతమైన, అద్భుతమైన బొమ్మ గీసినపుడు అతని కళ్ళలోని వెలుగును చూడాలి. ఆ భాగ్యం ఎంత మందికి లభిస్తుంది. అదే నేనంటే కూడుకి గుడ్డకి పనికిరాని భాగ్యం... అదే భాగ్యం?!" అని "సంపాదన చేతగాని వెర్రోళ్ళు" అన్నట్టు చూసేవాడు మమ్మల్ని. అలాగన్ని పనులు చేయడం తెలీని వాడేంకాదు వేది. వ్యవసాయం పనులు చాలా నేర్పుగా- ఒర్పుగా చేసేవాడు. ఏరు పూసి దుక్కి దున్నితే స్కేలు పెట్టి గీత గీసినట్టే సాలు పోసేవోడు. పార పట్టి దమ్ము మడికి గట్టు చెక్కితే వర్ణ చిత్రానికి ఫ్రేమ్ కట్టినట్టే... యిక ఎడ్లకు సికుమార్లు పలుపుల పూల కొరడాలు... రంగు రంగుల దారాలతో ఎంతందంగా తయారుచేసేవాడో! వరిసేని వోవులు బండికి ఎక్కించడం అంటే అది చాలా నైపుణ్యంతో చెయ్యాల్సిన పని. ఏ పని చేసినా కళాత్మకంగా చేసేవాడు.

నాగావళి నదికి ఇరువేపులా వున్న తీర గ్రామాలు మావి. నాగావళి ఇసకదిబ్బ మా కళా సృజనకు వేదిక. అందరూ సంపాదనలో చూసుకునే సౌందర్యం. సంతోషం మేము నాగావళి అలల తీగలు మీటే వెన్నెల వేళ్ళలోను, రెల్లుపూల కెరటాల మీద తేలియాడే పిల్లగాలి తరగల్లోనూ చూసుకునేవాళ్ళం. ఆ అందాలను అక్షరాల్లో, గీతల్లో పట్టుకుని పొంగిపోయేవాళ్ళం... అదే గొప్ప భాగ్యం మాకు.



వేది ఎస్సెస్సెల్సీతో చదువుకి చుక్క పెట్టేసాడు తండ్రి పోవడంతో. వేది నాన్న అభ్యుదయ భావాలున్న వ్యక్తి. నాటకాలకు రంగాలంకరణ, మేకప్ చేస్తూ చిన్న చిన్న పాత్రలు వేసేవాడు. ముఖ్యంగా అప్పటి కమ్యూనిస్టు పార్టీకి బాగా పట్టున్న గ్రామంతోను కామ్రేడ్‌లతోనూ మంచి పరిచయాలుండేవి. రచయిత భూషణం మాష్టారు ఆ నాటక సమాజంలో ఒక నటుడు. అప్పుడాయన 'కొండగాలి' నవల రాస్తున్నారని చెప్పుకునేవాళ్ళం. ఎ.పి.టి.ఎఫ్. సభలు, సమావేశాలు భూషణం మాష్టారి ప్రసంగాలు వారి రచనలు మమ్మల్ని బాగా వుత్తేజపరిచేవి. అటువంటి రచనలుంటాయని, అవి మన జీవితాల్లోంచే పుట్టుకొస్తాయని తెలీని మాకు మరో కొత్త లోకాన్ని చూపించేవి.

వేది చిత్రరచనలో నేనూహించని మార్పు. శిల్పసుందరి, దీపకన్య, అభిసారిక వంటి చిత్రాల నుంచి శ్రమైక జీవన సౌందర్య చిత్రణతో "కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు నే చిత్రించే నవీన చిత్రాలన్నా"డు. ఉపాధ్యాయ సంఘ సహావేశాల్లో, మహాసభల్లో రాష్ట్ర నాయకుల్తో చెప్పి వేది నఖచిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాణ్ణి. ఆ సభల్లో ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచేవి. భూషణం మాష్టారి ప్రసంగం వుందంటే ఆ సభకి తప్పకుండా హాజరయ్యేవాళ్ళం. ఆయన వ్యంగ్య బాణాలు, చతురోక్తులు సభను ఉత్తేజితం చేసేవి. అటువంటి సాహిత్య సందర్భంలోనే పరిచయమయ్యేడు వరీనియా. వేది బొమ్మలు చూసి ప్రశంసిస్తూనే కొన్ని సూచనలు చేసేడు. గీతల్లో కొత్తదనం వుండాలన్నాడు. తక్కువ గీతల్లో భావావిష్కరణ జరగాలన్నాడు. ఉత్తరాంధ్ర జన జీవితాన్ని బొమ్మల్లో చూపించాలన్నాడు. అది మొదలు వేదికి మరో ధ్యాస లేకపోయింది. స్కెచ్ బుక్ పట్టుకొని రామ్మందిరం దగ్గరా పొలంగట్ల మీదా నీలాటి రేవులో... మాలపేట వీధుల్లో తనదైన ముద్రతో ఉత్తరాంధ్ర జీవన శైలిని పట్టుకోవడం కోసం ఎంత శ్రమ పడ్డాడో!

"వీడికిదేం పిచ్చి... వ్యవసాయం ఎలాగుందో... పిల్లల చదువుల సంగతేటో... యివేవీ పట్టించుకోకుండా బొమ్మలనీ, మీటింగులనీ ఇల్లు పట్టకుండా తిరగడమే పనిలాగుంది. దానివల్ల పైసా వొచ్చిందా అంటే అదీ లేదు. నువ్వైనా ఒకమాట అనకపోతే ఎలాగమ్మీ" అని కోడలు మీద విసుక్కునేవాడు వేది పెదనాన్న. ఆ మహా యిల్లాలు ఒక్కమాట అనలేదు. సరికదా 'పోన్లే మామయ్యా నేను. సూసుకుంటున్నాను కదా. అతనికి అందులోనే ఆనందం. అతనికి నచ్చినట్టే చెయ్యనీ. మనకా విద్య రమ్మన్నా వచ్చేదీ కాదు. మనమా పని చెయ్యగలమా చెందగలమా!" అని సమర్థన. ఏమీ చదువుకోకున్నా ఎంత గొప్ప మాట అన్నదా యిల్లాలు! నా భార్యా వుంది. డిగ్రీ పాసయ్యింది. నా బుక్ షెల్ఫ్‌లో ఏ పుస్తకాలున్నాయో తెలీదావిడకి. సొమ్మంతా పుస్తకాలకే తగలేస్తున్నానని గోల. ఎప్పుడో కవిత రాయాలనిపించి కాగితాలు ముందేసుకుంటే చాలు... ఓ వాగ్బాణం. ఎప్పుడైనా ఏదైనా సాహిత్య సభవారు ఇచ్చిన జ్ఞాపికను తీసికెళ్తే... "ఆఁ... తెచ్చారు చెక్కముక్క" అనే యీసడింపు. వేది అప్పుడప్పుడూ వచ్చి నచ్చజెప్పబోయేవాడు. ఇద్దరికీ కలిపి దులిపేసేది. కొందరంతే. యీ విషయంలో వేది అదృష్టవంతుడు అనుకునేవాళ్ళం. అప్పుడు మాకు తెలీదు. అందర్లోకీ వాడే గొప్ప దురదృష్టవంతుడనీ. ఆ దురదృష్టం ప్రోజెక్టు రూపంలో ముంచుకొస్తుందనీ. ఏ నదిని మేం మా ప్రాణాధికంగా ప్రేమించామో ఏ నదిని మా జీవితంలోంచి వేరు చేయలేని భాగమనుకున్నామో ఆ నది మాకు కాకుండా పోయింది. మాకు కాకపోవడం కాదు. మమ్మల్ని ముంచింది.

ఓ రోజు బాగా ముసురు పట్టింది. బంగాళాఖాతంలో వాయుగుండం అన్నారు. ఊరు ఖాళీ చెయ్యాలన్నారు. ఇల్లు పొల్లు పిల్లా జెల్లా, గొడ్డు గోదా, కళ్ళాలు గడ్డికుప్పలు అన్నీ వదిలి ఎలా వెళ్ళాలో మాకు బోధపడలేదు. అధికారులొచ్చేరు. పోలీసులొచ్చేరు. లాఠీలొచ్చేయి. 'సావైనా, బతుకైనా యీ మట్టి మీదనే...' అని మొండిపట్టు పట్టేరు ముసిలోళ్ళు. అందర్నీ బలవంతంగా లారీలకెక్కించి ఊళ్ళు ఖాళీ చేయించి

పునరావాస కేంద్రాలకు తరలించారు. కొద్ది రోజుల్లోనే ముంపు గ్రామాలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ళ నిర్మాణాలు పూర్తయి శాశ్వతంగా ఊళ్ళు ఖాళీ చేస్సేం. నదిని దానం చేసి అలల మీద ఆశ వదులుకుని చెట్టుకో పిట్టగా ఎగిరిపోయేము. ప్రాజెక్టు పేరుతో అందిన పరిహారం ఫలహారమై పోయింది. ఇల్లు భూములు ఏట్లో కలిసిపోయేయి. మా గ్రామాల మధ్య దూరం పెరిగి ఉద్యోగం పేరుతో నేనింకా దూరమయ్యేను. నాగావళి ఒడ్డున నిలబడి సూర్యోదయాలకు స్వాగతం పలికి, సూర్యాస్తమయాలకు వీడ్కోలు చెప్పే భాగ్యానికి శాశ్వతంగా కోల్పోయేం మేము.

ఇంటికి పొలాలకీ వచ్చిన పేకేజీ సొమ్ము అప్పులు తీర్చడానికి... పుట్టుకొచ్చిన కొత్త అవసరాలకి హారాయించుకుపోగా మిగిలిన కొద్ది సొమ్ముతో కూతురు పెళ్ళి జరిపించేసి రిక్త హస్తాలతో మిగిలేడు వేది. కొడుకు ఏవో చిన్న చిన్న వ్యాపారాలు చేసినా ఏదీ కలిసి రాలేదట. ఆఖరికి టీ కొట్టు పెట్టుకున్నా దినం దీరక వలసెళ్ళిపోయేడట కొడుకుతో. కొందరు మద్రాసెళ్ళేడన్నారు. మద్రాసు నుండి హైదరాబాదు వెళ్ళిపోయేడన్నారు కొందరు. ఏలూరులో ఓ చౌదరి గారి పొలంలో పనికి కుదురుకున్నాడన్నారు మరి కొందరు. వేది ఖాళీ చేసిన ఇంటినైనా చూసెళ్ళాలని ఆ వూరెళ్ళేను. ఊరు వల్లకాటి దిబ్బలా కనిపించింది. చుట్టూ నీరు కమ్ముకుని ఆరిపోయిన కార్తీక దీపంలాగుంది. నర సంచారం లేని వూరిలో చెట్టు చేమా కూడా ఎంత గుబులు పుట్టిస్తాయో అక్కడ మిగిలివున్న చెట్లను చూస్తే అర్థమయ్యింది. భయంకర నిశ్శబ్దం అంటే కూడా అప్పుడే తెలిసింది. ఊరికి తూరుపు మొగలో కూలిన గోడలతో విరిగిన పలకలా బడి. ఉత్తర దిక్కున నీటిపై తేలుతున్న చిరిగిన బద్దల గిడుగులాగ అసిరమ్మ గుడి. పాటలతో పరవశించే అరుగులేనా అవి. ఆటలతో హోరెత్తే వీధులేనా అవి! వేది గీసిన బొమ్మలతో ఆదరంగా ఆహ్వానం పలికే గోడలేనా అవి!!

నా వొళ్ళు జలదరించింది.

ఇప్పుడా వూరూ... మా వూరు మరో ఏడు గ్రామాలు అనంత జలరాశికి అట్టడుగున... అదిగో ద్వారక సముద్ర గర్భాన అన్నట్టు...

నా చేతిలో నిర్వాసిత గీతం.

అలలను మీటినట్టే వుంది అట్టమీది బొమ్మను తాకితే.

పేజీలు తిప్పేను.

ప్రతి కవితా ఒక తడి కన్నులా.

***



"నీరు నిండిపోతే ఆ గుడీ మునిగిపోతుందా..." దూరంగా కనిపిస్తున్న గుంప సోమేశ్వరాలయాన్ని చూస్తూ అన్నాడోసారి వేది. ప్రతి యేటా శివరాత్రికి జరిగే యాత్ర. రాత్రి జాగారాలూ, అభిషేకాలూ... కార్తీక సోమవారాలూ... వన భోజనాలు... ఆ సందడీ గుర్తొచ్చేయేమో... గొంతులో దిగులూ...

"నీరు నిండిపోతే ఆ గుడీ మునిగి పోతుందా..." దూరంగా కనిపిస్తున్న గుంప సోమేశ్వరాలయాన్ని చూస్తూ అన్నాడోసారి వేది. ప్రతి యేటా శివరాత్రికి జరిగే యాత్ర, రాత్రి జాగారాలూ, అభిషేకాలూ... కార్తీక సోమవారాలూ... వన భోజనాలు... ఆ సందడీ గుర్తొచ్చేయేమో... గొంతులో దిగులూ...

"కార్తీకమాసం గదా... మన సాహితీ మిత్రులతో పిక్నిక్ ఇక్కడే..." చింతా తన నిర్ణయం ప్రకటించేడు.

"సాహితీ మిత్రులందర్నీ పిలుద్దాం. మళ్ళీ ఇక్కడకు వచ్చే అవకాశం రాకపోవచ్చు..." చింతను బలపరిచేడు మల్లిపురం.

"కార్తీకమాసం ఆఖరి సోమవారం... గుంప కోవెల తోటలో వన భోజనం... మీకిదే ఆహ్వానం" అని ఎస్సెమ్మెస్‌లతో వార్త అందరికీ చేరవేస్సేడు సాహిత్య ప్రపంచంలోకి అప్పుడే అడుగు పెడుతున్న వుత్సాహం మల్లిపురంలో.

అదే మేము చివరిసారి గుంప కోవెలకి వెళ్ళింది.

గుంప సోమేశ్వరాలయం.

నాగావళి జంఝావతి నదుల పవిత్ర సంగమ క్షేత్రం. ఇరు తీరాల తోటలు, చెట్లు జనంతో విరగబూసినట్టు... వుత్సాహంతో వూగిపోయేయి. ఆకుల్ని పువ్వుల్ని కాక మనుషుల్ని రాల్చినట్టు ప్రతి చెట్టు క్రిందా జనమే. వంటలు భోజనాలు, ఆటలు పాటలు, నవ్వులు, తుళ్ళింతలు కేరింతలు గుంప కోవెల పరిసరాలు పరవశించిపోయేయి.

మళ్ళీ ఇక్కడకు రాలేం కదా. గుడిని యిక [illegible] అనే భావన [illegible]రిలోనూ. ఆ భావనలోనే జనం ఎక్కువ సంఖ్యలో [illegible]డికి.

ఇక్కడి శివలింగాన్ని ద్వాపర యుగంలో బలదేవుడు ప్రతిష్టించేడంటారు. కురుక్షేత్ర యుద్ధంలో రక్తపాతం తన కళ్ళతో చూడలేనని తీర్థయాత్రలకు బయలుదేరిన బలరాముడు అనేక పుణ్యక్షేత్రాల్ని దర్శిస్తూ ఈ ప్రాంతానికి వచ్చేడట. ఒరిస్సాలోని పాయకపాడు దగ్గర తన హలాయుధంతో నేలను చీల్చితే ఒక నీటిపాయ వుబికి వచ్చిందట. అక్కడ శివలింగాన్ని ప్రతిష్టించి హలాయుధంతో ఆ నీటి పాయను తన వెంట తీసుకెళ్ళి కళ్ళేపల్లి సముద్ర తీరంలో కలిపాడట. అదే నాగావళిగా మనం పిలుస్తున్న యీ నది. బలరాముని నాగలి మొనతో ఉద్భవించిన నది కాబట్టి దీని పేరు నాగావళి అయ్యిందట. దీన్ని 'లాంగుల్యా' అనీ అంటారు.

యీ నది [illegible]త... గుంప, సంగం, శ్రీకాకుళం, [illegible]ళ్ళేపల్లిలో ఒకే రోజు పంచలింగాలు ప్రతిష్టించాడట. యీ ఐదు క్షేత్రాల్ని ఒకే[illegible]జు అభిషేకం చేసినవాళ్ళకి పునర్జన్మ వుండదని [illegible]మ్మతారు భక్తులు.

శ్రీశైలం నుండి వచ్చిన ఓ జంగమయ్య యీ ఏటి ఒడ్డున వెదురు గుంపుల మధ్య శివలింగాన్ని చూసి ఇక్కడే పూజాదికాలు నిర్వహిస్తూ వుండిపోయేడట. ఆ తరువాతెప్పుడో 1617 సం॥ లో జయపురం మహారాజు విశ్వంబర మహాదేవ్ దేవాలయ నిర్మాణం గావించారని చెబుతారు.

వేది చెబుతుంటే గోరాలో ఉద్విగ్నత.

"బలదేవుడి పాదస్పర్శతో పునీతమైన నేలలో మనం నిలుచున్నామనే భావనే నాకేదో తెలియని పారవశ్యాన్ని కలుగజేస్తోంది. హరికథా పితామహుడు ఆదిభట్ల బండి కట్టించుకుని వచ్చాడంటారే ఆ గుంప... యిదే కదా" రవీంద్ర సందేహం.

వరీనియా, లాంగుల్య, వేది యీ ముగ్గురు తప్ప మిగతా అందరూ గుంప కోవెలకు వచ్చింది అప్పుడే. అదే చివరిసారి కూడా. బేరేజీ నిర్మాణంలో మునిగిపోతున్న గ్రామాల్లో తిరిగి అందరూ కవితలు రాసేం. వాటిని ఓ సంకలనంగా తేవాలని అప్పటి మా ఆలోచన. వరీనియా, సాగర్, చలం కవితలు చూడ్డంలో నిమగ్నమైపోయేరు.

"పురాతన యాత్రా స్థలంగా ప్రసిద్ధి గాంచిన యీ శైవక్షేత్రం కనుమరుగైపోతున్న నేపథ్యంలో 'ఆలయం అదృశ్యమైపోతున్న దృశ్యం! గురించిన కవిత లేకపోతె ఎలాగ?" అన్నాడు వేది. అందరి కవితల్ని అప్పటికే చదివేసాడు.

"ముఖచిత్రం కూడా అదే కాన్సెప్ట్‌తో బొమ్మ యిద్దాం. కవిత్వ సందర్భానికి తగినట్టుంటుంది. కోవెలంటే కేవలం రాళ్ళపేర్పు మాత్రమే కాదు కదా. అది వేల సంవత్సరాల జనం విశ్వాసాల కూర్పు. సాంస్కృతిక మూలాల నిర్మాణం. భక్తి, పూజ, దేవుడు... కేవలం బయటికి చెప్పే కారణం మాత్రమే. అనేక జాతుల, భిన్న మతాల, వివిధ ప్రాంతాల, భిన్న సంస్కృతుల ప్రజలను ఒక చోటికి చేర్చే సంగమ క్షేత్రం. ఐక్యతా సందేశాన్ని లోకానికి అందించే గొప్ప వేదికలు కదా దేవాలయాలు. కాల ప్రవాహానికి ఎదురు నిలిచిన శిల్పకళా ప్రాభవానికి ప్రతీకలు. దేవాలయాలు మన జాతి సాంస్కృతిక సంపదలు. గుడి మునిగిపోవడమంటే ప్రాచీన జాతి సంపదను భావితరాలకు అందకుండా పోవడంగా భావించాలి..."

ఏవేవో ముప్పిరి గొంటున్న భావాలతో చూసేడు వేది వేపు లాంగుల్య ఏ చారిత్రక కాలాల్లోనో పరిభ్రమిస్తున్నట్టు.

"హలాయుధుడైన బలరాముడు తొలి రైతు ప్రతినిధిగా మనకు దర్శనమిచ్చే పురాణ పురుషుడు. ఆ నాగలి అస్తిత్వం ప్రశ్నార్థకమైపోయిందిప్పుడు, రైతుల వలసలతో. వ్యవసాయం వ్యాపారమైపోయింది

పెట్టుబడిదారుల వాణిజ్య పంటలతో. విధ్వంస కృషికి జీవన చిహ్నాలుగా విరిగిన నొగ్లు, బండి చక్రం, కబేళా దారిలో పశువులు... యీ చిత్రం అట్టవెనక వేస్తే, మరింత అర్థవంతంగా వుంటుంది కదా" వరీనియా సూచన.

అప్పటికే వేది మనో ఫలకం మీద బొమ్మ సిద్ధమైపోయినట్టుంది. 'కోవెల అదృశ్యమౌతున్న దృశ్యం' శీర్షికతో కవిత రాసే బాధ్యత లాంగుల్య తీసుకున్నాడు.

అందరం కవితలు చదివేం. అన్ని కవితలూ జాగ్రత్తగా విని సాగర్, వరీనియా, నిష్కర్షగా చెప్పేరు కొన్ని కవితలు సంకలనంలో వేయడానికి తగినవిగా లేవన్నారు. తిరిగి రాయాల్సిందే అన్నారు.

అదీ యిప్పుడే జరగాలని పట్టుబట్టేరు చలం. స్వా.నా. తన కవిత నిడివి తగ్గించుకోడానికి ఓ చెట్టు కిందికి చేరుకున్నాడు. మేము మా కవిత్వ చర్చల్లో వుండగా వేది తన నఖచిత్రాన్ని గీసేడు. గీసి, ఆ తెల్ల కాగితాన్ని ఎండలో ఏటవాలుగా వుంచి చూపించేడు. కాగితమ్మీద ఎంబాస్ చేసినట్టు ఉబ్బెత్తుగా వున్న ఆ బొమ్మ నీడల రేఖలతో స్పష్టంగా కనిపించింది. అది నాగలి మొన మీద గిర గిరా తిరిగే భూగోళం.

"ఈ చిత్రాన్ని ఫొటో తీయించి పుస్తకానికి లోపలి టైటిల్ పేజీలో వేస్తే..." చలం, సాగర్ ఒకేసారన్నారు.

"భూమి నీటి అడుక్కి జారిపోయి జనం పక్షుల్లా ఎగిరిపోతుంటే నాగలి మొన మీద నిలబెట్టిన ఘనుడు మా పరిశిచాప్" చింతాతల్ని ఎలా గీస్తారో వేది... అడిగినవాళ్ళకు గోటితో బొమ్మ గీసి చెప్పేడు.

ఇదో అరుదైన కళ... అంటూ వేదిని సంభ్రమంగా చూసేరు. కొందరు తమ బొమ్మలు గీయించుకుని మురిసిపోయారు.

ఎవరో అన్నారు 'అరుదైన ఈ చిత్రాల్ని పుస్తకంగా తెస్తే?' వేది నవ్వి వూరుకున్నాడు.

కవిత్వ పఠనం, సాహితీ చర్చలు, మోహన్, రామనాయుడు, మల్లిపురం పాటలు, చింతా వోలకాలు... వేది నఖ చిత్ర ప్రదర్శన ఆ కార్తీక మాసపు ఆఖరి సోమవారం సాయంత్రాన్ని అద్భుతంగా మార్చేసాయి.


నాగావళి జల శరీరం అలలు అలలుగా పులకరించింది.

మా చుట్టూ జనం. అనుకోని రీతిలో ఆ సాయంత్రం అదో సాహిత్య సభగా మారిపోయింది. వరీనియా ఉద్వేగభరితమైన ప్రసంగం చేసేడు. నదిని దానం చేసాక కోల్పోతున్న జీవితాన్ని కళ్ళముందు ఆవిష్కరించేడు. 'ముంపు మనది. సొంపు సంపన్నులది' అని జలయజ్ఞం నేపధ్యాన్ని... ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని ఎన్నెన్నో కథల్ని ఉదహరిస్తూ చెప్పేడు.

హృదయాలు బరువెక్కిపోయేయి.

అప్పుడందుకున్నాడు మల్లిపురం హుషారైన పాట

"తుళ్ళి తుళ్ళి ఆడింది గాలి
కొంటెచూపు విసిరి నవ్వింది నాగావళి..."



**బేరేజీ పూర్తయ్యాక జలసమాధి కానున్న గుంప సోమేశ్వరాలయం చిత్రాన్ని అద్భుతంగా చిత్రించేడు. ఆలయ గోపుర కలశం మీద రెక్కలల్లార్చుతూ వాలుతున్న 'గెద్ద'ను... ఆ ప్రక్కనే జలసమాధి మీద నౌకా విహారాన్ని చిత్రించి మా గ్రామాలకు పట్టబోయే దుర్దశను ముందుగానే సూచించాడు. డి.టి.పీ. అవుతున్నపుడే కంప్యూటర్ ముందు కూర్చుని ప్రూఫులు దిద్దాడు. ఒక్క అచ్చుతప్పు లేకుండా చేసేడు. పుస్తకం పూర్తయ్యేదాకా పట్నంకీ, ఇంటికీ కాళ్ళరిగేలా తిరిగేడు. అయినా అనుకున్న తేదీకి పుస్తకం ఇవ్వలేకపోయేడు ప్రెస్‌వాడు ఏవేవో కారణాలు చెప్పి. ఆవిష్కరణ తేదీ మార్చవలసి వచ్చింది.**

సహజ ధోరణిలో చమత్కరిస్తే అప్పుడు వేది ఏమన్నాడూ?

"అవినీతి బంధుప్రీతి కెరటాలై ఎగిసిపడే జలయాగంతో మునిగిపోతున్న భూగోళాన్ని రైతులోకమే సంఘటితమై రక్షించుకోవాలి కదా మరి".

"ఔన్నిజమే. ఆ బాధ్యత మన అందరికీ. రైతులోకాన్ని ఈ కవితా సంకలనంతో మనమే మేల్కొలుపుదాం. ఊరూరా పుస్తక పరిచయ సభలు జరుపుదాం" ఉద్వేగంగా అన్నాడు మల్లిపురం.

"అది సరే. మరి పుస్తక ప్రచురణ కోసం ఆర్థిక వనరులు..." సందేహంగా చూసేడు వేది.

"ఆ పని నాది కదా" ఎప్పుడొచ్చాడో శాంతి. అతని మాటతో అందరిలో మరింత ఉత్సాహం.

అప్పుడొచ్చేరు రాజు, అప్పారావు... ఆలస్యానికి సంజాయిషీ చెప్తూ. ఆ యిద్దరూ వేది దగ్గర డ్రాయింగ్ నేర్చుకుంటున్నారు. వస్తూనే ఆ నాగావళి ఒడ్డున తోటలో చెట్టుకు చెట్టుకు ప్లాస్టిక్ వైర్లు బిగదీసి వాటికి వేది గీసిన నఖచిత్రాల ఫొటోలు... పౌరాణిక, చారిత్రక, సామాజిక అంశాలుగా విడదీసి 'నఖచిత్ర ప్రదర్శన' ఏర్పాటు చేసేరు.

'ఎవరిదీ ఆలోచన, బాగుంది' సంతోషపడిపోయారు అందరూ.

వన భోజనాలకు వచ్చినవారంతా ఆ ప్రదర్శన చూసి 'అద్భుతం' అన్నారు. వేది కళ్ళలో మెరుపు.

"ఎన్నో చోట్ల విద్యా వైజ్ఞానిక మహాసభల్లో నఖచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసేం. కానీ యిప్పటి ఈ అనుభవం గొప్పది" అని సంబరపడిపోయేడు.

సందర్శకులంతా ఆ నఖ చిత్రాల్ని చూసి అబ్బురపడ్డారు. ఆ చిత్రా

నాగావళి అలల తుళ్ళింతల్లాగానే సాగి, హృదయాలను తేలికపరిచి పాట చిరుగాలి మేనాలో పరిసరాలను చుట్టు ముట్టింది.


గుంప కోవెల వెనక్కి పొద్దు జారిపోతుంటే తదేకంగా చూస్తూ వేది కవితా సంకలనం ముఖ చిత్రానికి మనసులోనే రంగులు కలుపుకుంటున్నట్టు కనిపించేడప్పుడు.

***

అనుకున్నదానికంటే బాగా వొచ్చింది పుస్తకం. వేది చిత్రించిన నీటి రంగుల ముఖచిత్రం సంకలనానికి గొప్ప ఆకర్షణ అయ్యింది.

బేరేజీ పూర్తయ్యాక జలసమాధి కానున్న గుంప సోమేశ్వరాలయం చిత్రాన్ని అద్భుతంగా చిత్రించేడు. ఆలయ గోపుర కలశం మీద రెక్కలల్లార్చుతూ వాలుతున్న 'గెద్ద'ను... ఆ ప్రక్కనే జలసమాధి మీద నౌకా విహారాన్ని చిత్రించి మా గ్రామాలకు పట్టబోయే దుర్దశను ముందుగానే సూచించాడు. డి.టి.పీ. అవుతున్నపుడే కంప్యూటర్ ముందు కూర్చుని ప్రూఫులు దిద్దాడు. ఒక్క అచ్చుతప్పు లేకుండా చేసేడు. పుస్తకం పూర్తయ్యేదాకా పట్నంకీ, ఇంటికీ కాళ్ళరిగేలా తిరిగేడు. అయినా అనుకున్న తేదీకి పుస్తకం ఇవ్వలేకపోయేడు ప్రెస్‌వాడు ఏవేవో కారణాలు చెప్పి. ఆవిష్కరణ తేదీ మార్చవలసి వచ్చింది. ఆలస్యమే అయినా గొప్ప ఉత్సాహకర వాతావరణంలో అద్భుతంగా జరిగింది ఆవిష్కరణ సభ. అనేక ప్రాంతాల నుండి విశేషంగా వచ్చేరు సాహితీ మిత్రులు. పుస్తకం బాగా వచ్చిందన్నారు. ముఖ్యంగా కవర్ పేజీ. వేదిని ప్రశంసలతో ముంచెత్తేరు. విషాదమేమంటే ఆనాటి ఆవిష్కరణ సభలో వేది లేకపోవడం.

**(తరువాయి 32వ పేజీలో)**




# ధార్మిక నిలయంలో ప్రశాంత జీవితం



వీరయ్య

మనం నమ్ముకున్న దేవుణ్ని మనస్ఫూర్తిగా పూజిస్తే వందేళ్లయినా ఆనందంగా, ఆరోగ్యంగా గడపవచ్చని నా స్వీయానుభవం ద్వారా నేను నేర్చుకున్నాను. త్వరలో శత సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న నన్ను ఆ ధార్మిక భావనే ఈ వయసులో చేయిపట్టి నడిపిస్తోంది. ఇప్పటికైతే తల నొప్పి వంటి చిన్న సమస్యయినా లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండటం నా అదృష్టంగానే భావిస్తున్నాను. కళ్లజోడు వాడాల్సిన అవసరం నాకు ఇంతవరకు రాలేదు. ఇప్పటివరకు 65 సన్మానాలతోపాటు 'గజారోహణం' కూడా జరిగింది. నాకు నలుగురు సంతానం. 75 ఏళ్ల వయసులో నా భార్య మరణం మానసికంగా తీరని వేదనను కలిగించింది. నన్ను ఆదరించే వాళ్లు లేనందువల్ల ఓ ఆధ్యాత్మిక నిలయంలో శేష జీవితం గడుపుతున్నాను. నా చిన్నతనంలో మూకీ సినిమా చూసినప్పుడు టికెట్ 9 పైసలు, బంగారం 10 గ్రాముల ధర 13 రూపాయలు ఉండేది. జీవితంలో అనుభవించాల్సినవన్నీ అనుభవించాను. ఇప్పుడు నాకు ఎలాంటి కోరికలు లేవు. ఆ భగవంతుని దయవల్ల ప్రశాంతంగా ఉన్నాను.

- ఎం.వీరయ్య, పుట్టపర్తి, అనంతపురం జిల్లా

# సంగీత, సాహిత్యసేవకే అంకితం



సుబ్బలక్ష్మి

నా వయసు ఇప్పుడు 70 సంవత్సరాలు. మా వారు అవినీతి నిరోధకశాఖలో పని చేసేవారు. ఆయన ఉద్యోగరీత్యా దాదాపు 40 సంవత్సరాలు హైదరాబాద్‌లో ఉండి, పదవీ విరమణ చేసిన తరువాత విశాఖలోని స్వగ్రామం చేరుకున్నాం. హైదరాబాద్‌లో ఉన్న సమయంలోనే నేను సంగీతం నేర్చుకున్నాను. తెలుగు పండిట్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలినై ఒక స్కూల్లో కొంత కాలం తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేసాను. ఆరు సంవత్సరాల క్రితం నా భర్త గతించడం నాకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. మాకు సంతానం లేని కారణంగా పరిసర గ్రామ వాస్తవ్యుడైన ఓ తెలుగు పండిట్‌ని మానస పుత్రుడిగా స్వీకరించాను. గడిచిపోయిన కాలం గురించి నేను చింతించటం లేదు. సంగీత, సాహిత్యాలే నాకు ఊపిరిగా ఇద్దరం సంగీత, సాహిత్యసేవ చేస్తున్నాం. 'రానిది రాదు' అన్న త్యాగరాజ కీర్తన నాకు ఎంతో స్ఫూర్తిదాయకం. నిరాశ, నిస్పృహల కులోను గాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను పదిమందికి బోధిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నిశ్చింతగా ఉన్నాను. ఈ జీవితం నాకెంతో సంతృప్తికరంగా ఉంది.

- ఎం.సుబ్బలక్ష్మి, కోటవీధి, చోడవరం, విశాఖజిల్లా

# పొద్దు మునిగిపోయింది

(18వ పేజీ తరువాయి)

ఊరు ఖాళీ చేసాక పరిస్థితులు మారిపోయేయని, ప్రస్తుతం వుంటున్న వూరును వదిలి వలస బండిని ఎక్కక తప్పలేదని ఎక్కడో బతుకు తెరువు చూసుకున్నాక ఆవిష్కరణ సభతేదీ తెలియజేస్తే వచ్చే ప్రయత్నం చేస్తానని ఉత్తరం రాస్తూ ఓ సెల్ నంబరు యిచ్చేడు. ముఖచిత్రం ఒరిజినల్ పెయింటింగు ప్రెస్ నుండి తీసుకుపోతున్నట్టు రాసేడు.

ఆవిష్కరణ సభ అనుకున్నాక వేది యిచ్చిన నంబర్‌కి ఫోన్ చేస్తే... నంబరు మనుగడలో లేదని సమాధానం. వేది నుంచి ఫోన్ లేదు.

తాను గీసిన బొమ్మ ముఖచిత్రంగా వస్తుందని ఎంత పొంగిపోయేడో వేది. వేది కోసం చేసిన ఏ ప్రయత్నమూ ఫలించలేదు.

ఆలస్యంగా తెలిసిన విషయం ఇదీ...

"ఊరు ఖాళీ చేసే సమయంలోనే 'గ్లకోమా' ఆపరేషన్ కోసం పర్లాఖిమిడి వెళ్ళేడు వేది. ఇల్లు ఖాళీ చేసే హడావిడిలో వేది చిత్రించిన వర్ణచిత్రాలు, నఖ చిత్రాలు పాత ఇంట్లోనే వదిలేసాడు వేది కొడుకు. ఆ బొమ్మలంటే కూడా ఏ మూలో కోపం వేది కొడుక్కి... వేది పెదనాన్నకి. ఆ బొమ్మలే తాము ఆర్థికంగా ఎదగలేకపోవడానికి కారణమని వారి ఆరోపణ. తరువాతెప్పుడో వెళ్ళి చూస్తే ఊరుచుట్టూ నీరు. ఇంట్లో పాములు... తేళ్లు... పురుగూ పుట్రా... బొమ్మలు దాచిన అట్టపెట్టె నిండా చెదా. ఒక్క బొమ్మా మిగలలేదు. జీవితకాలపు కళా సృజన చెదపురుగుల పాలయ్యింది. అప్పటినుంచీ వేది అస్థిమితంగా వున్నాడని... ఎక్కడెక్కడో తిరుగుతున్నాడనీ...".

ఎలాగైనా వేదిని కలుసుకోవాలని అనుకున్నాను. అక్కడక్కడా వాకబు చేసుకుంటూ వెళ్ళేను. జబ్బుతో మంచానున్న వేది పెదనాన్న, వేది కొడుకు గురించిన వివరాలు చెప్పాడు.

కుతుబుల్లాపూర్‌లో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో ఇటుకలు మోస్తూ కనిపించాడు వేది కొడుకు.

నన్ను చూసి కంటనీరు పెట్టుకున్నాడు. దుఃఖం ఆపుకోలేకపోయాను. "ఆరు మాసాలయింది నాన్న ఇల్లు వదిలి. ఎన్నోచోట్ల వెతికేను... జాడలేదు" అని బావురుమన్నాడు.

నా రెండు కళ్ళూ వర్షిస్తున్నాయి. ఓ కంట నాగావళి ఓ కంట జంఝావతి. నా కన్నీటి ఏటిలో పుస్తకం మీది గుంప ఆలయ గోపుర కలశం మునిగి పోయింది.

"యీ పెయింటింగ్ ఒరిజినల్ శిల్పారామంలో చూసేన్నాన్నా" నా చేతిలో పుస్తకం తీసుకుని ముఖచిత్రం చూసి చెప్పేడు మా అబ్బాయి సంభ్రమంగా.

"పాపం ఆర్టిస్ట్ బాగా యిబ్బందుల్లో వున్నట్టుంది నాన్నా. జబ్బు పడ్డట్టున్నారు. పెరిగిన జుట్టూ... గెడ్డం... అదీ పిచ్చోడిలా... దయనీయంగా వున్నాడు. నా వేపు దీక్షగా చూసేడెందుకో... గోటితో నా బొమ్మ కూడా గీసేడు..." అని తెచ్చి చూపించేడు.

అవే గీతలు. అత్యంత ఆకర్షణీయమైన కొనగోటి గీతలు.

వాడే... మా వేది... పరసువేది.

"రోజూ... సాయంత్రం ఓ గంట అక్కడ గోటితో బొమ్మలు గీస్తుంటాడట నాన్నా..." మా వాడేదో చెప్తున్నాడు.

వెంటనే బయలుదేరాను.

"... నాన్నా యిప్పుడెక్కడికీ... నీకసలే హెల్త్ బాగోలేదు..." ఆపబోయేడు మా అబ్బాయి వినిపించుకునే స్థితిలో లేన్నేను.

పరుగు లాంటి నడకతో రోడ్డెక్కాను.

ఆటో... బస్సులు... మారి ట్రాఫిక్‌జామ్‌ల పద్మవ్యూహాల్ని ఛేదించుకుని శిల్పారామం చేరుకున్నాను. అయితే... అప్పటికే...

పొద్దు మునిగి పోయింది.

## ఆదివారం క్విజ్ సమాధానాలు

1. పారిస్
2. రూపాయి
3. 1918లో
4. వి.వి.గిరి
5. జోహాన్ గుటెంబర్గ్